క్లుప్తంగా

నవమి ఉత్సవాలకు రాట ముహూర్తం



జి.మామిడాడ కోదండ రామాలయంలో ఉత్సవాలకు రాట ముహూర్తం చేస్తున్న దృశ్యం

పెదపూడి: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన జి.మామిడాడ గ్రామంలో కొలువైన కోదండ రామాలయంలో ఈ నెల 30న జరిగే శ్రీరామ నవమి, శ్రీరాముడు, సీతాదేవి కల్యాణోత్సవాలకు బుధవారం రాట ముహూర్తం చేశారు. ఆలయ ధర్మకర్త ద్వారంపూడి శ్రీరామ మురళీకృష్ణ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బుధవారం నుంచి ఆలయంలో కల్యాణ ఏర్పాటు పనులు ప్రారంభిస్తామన్నారు. అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

సీతానగరం: చినకొండేపూడికి చెందిన బాధిత కుటుంబానికి సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పలివెల వీరబాబు బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల మోయేటి నాని రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. వీరు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నందున వీరబాబు, మండల మహిళా అధ్యక్షురాలు పలివెల జ్యోతి దంపతులు ఆర్థికసాయం చేశారు.

లింగనిర్ధారణ పరీక్షలు నేరం



మాట్లాడుతున్న హెల్త్ అసిస్టెంట్ నగేష్‌బాబు

సీతానగరం: ప్రీ కన్సెప్షన్ అండ్ ప్రీ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ యాక్ట్ 1994 (పీసీపీఎన్‌డీటీ)పై బుధవారం ముగ్గళ్లలో బాలింతలు, గర్భిణులకు పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ సుంకర నగేష్‌బాబు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భ్రూణ హత్యలు, లింగ నిర్ధారణ పరీక్షలు నేరమన్నారు. వీటిని చేసిన వారు, చేయించుకున్న వారు కూడా శిక్షార్హులన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం షహదాబేగం, అంగన్‌వాడీ టీచర్ వెంకటలక్ష్మి, ఆశావర్కర్లు మరియ, సుకన్య, మాధవి, ఆయా చిన్నారి పాల్గొన్నారు.

టవర్ బ్యాటరీలు మాయం

సీతానగరం: మండలంలోని కాటవరం బీఎస్ఎన్ఎల్ టవర్ బ్యాటరీలు మాయమయ్యాయి. గత నెల 27 రాత్రి బీఎస్ఎన్ఎల్ టవర్ వద్ద ఉన్న 24 బ్యాటరీలు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని కోరుకొండ సబ్ డివిజన్ ఇంజినీర్ రాజేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



ఇలపల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ శ్రీనివాస్

బిక్కవోలు: మండలంలోని రంగాపురం, ఇలపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీడీ జి.శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం చివరి దశకు చేరుకుందన్నారు. ఇప్పటికే 100 రోజులు పని పూర్తి చేసిన కుటుంబాలు 81 మాత్రమే ఉన్నాయన్నారు. ఈ సంఖ్య పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ వెంకటేశ్వరరావు, టీఏలు వెంకటరమణ, వెంకటలక్ష్మి, రంగాపురం సర్పంచ్ గండికోట వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

అనపర్తి: స్థానిక ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడిగా స్థానిక జీకే ఫొటో స్టూడియో అధినేత రెడ్డి గోపాలకృష్ణ ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా గాయత్రి సత్యనారాయణ, శేఖర్, ముఖ్య సలహాదారులుగా వెంకటేశ్వరకృష్ణ, భానురాజు, కార్యదర్శిగా సందీప్, ఉపాధ్యక్షుడిగా షేక్ ఇమామ్, సంయుక్త కార్యదర్శిగా గంగాధర్, కోశాధికారిగా రవి, సహాయ కోశాధికారిగా శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా రమేష్, నాగు, శ్యామ్, సత్తిబాబు వ్యవహరించనున్నారు.

గాలికుంటు నివారణ టీకాలు

రంగంపేట: పశుసంవర్ధక శాఖ ద్వారా మండలంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు మండల పశు వైద్యాధికారి జాన్‌పాల్ తెలిపారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వడిశలేరులో బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు.

సుజలం.. సస్యశ్యామలం

- 'పుష్కర'తో 1.55 లక్షల ఎకరాలకు నీరు
- ఎనిమిది మోటార్ల ద్వారా విడుదల



పురుషోత్తపట్నంలోని తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం

సీతానగరం: పురుషోత్తపట్నంలోని తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం రైతులకు వరంగా మారింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మెట్టప్రాంత పొలాలకు సాగునీరు అందించడానికి దీనిని నెలకొల్పారు. దీనిద్వారా సాగునీటిని విడుదల చేసి, ఆ ప్రాంత భూములను సస్యశ్యామలం చేశారు. వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో జలయజ్ఞంలో భాగంగా 2008 మార్చిలో యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ చేతుల మీదుగా పుష్కర పథకం ప్రారంభమైంది.

పుష్కలంగా సాగునీరు

మెట్టప్రాంత పొలాలు నీరందించే ఈ పథకాన్ని పుష్కర -1, పుష్కర -2గా నెలకొల్పారు. వన్‌లో నాలుగు మోటార్లు, టూలో మరో నాలుగు మోటార్లు ఉంటాయి. మూడు రన్నింగ్‌లోనూ ఒకటి స్టాండ్‌బైగా ఏర్పాటు చేశారు. ఒక్కొక్క మోటారు 175 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుంది. మోటారు పదివేల గంటలు తిరిగిన అనంతరం ఓవరాయిలింగ్ చేయాలి. ఈ పథకం నుంచి 6.9 కిలోమీటర్లు పొడవైన పైపులైన్లు ద్వారా దేవీపట్నం మండలం గండికోటలోని పుష్కర కాలువలో నీరు పడుతుంది. దీనినుంచి ప్రతి ఏడాదీ ఖరీఫ్ సీజన్‌లో పుష్కలంగా సాగునీరు అందిస్తున్నారు. ఏడు నియోజకవర్గాల్లోని 18 మండలాలకు చెందిన 1,85,906 ఎకరాలకు నీరందించడానికి వైఎస్సార్ జలయజ్ఞంలో తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం నెలకొల్పారు. పదకొండు సబ్‌లిఫ్టులు ఏర్పాటు చేసి ఇప్పటికి 1.55 లక్షల ఎకరాలకు ఖరీఫ్ సీజన్‌లో నీరందిస్తున్నారు. వేసవిలో మూడు వందలకు పైగా చెరువులను నీటితో నింపుతున్నారు. ఈ పథకం ద్వారా పూర్తిస్థాయిలో లక్ష్యాన్ని చేరుకోవడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

రైతులకు చంద్రబాబు ద్రోహం

రైతులకు మేలు చేయాలనే సంకల్పంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పుష్కర ఎత్తిపోతల పథకాలను నెలకొల్పితే, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రం నిరుపయోగమైన పట్టిసీమ, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాలను నెలకొల్పి వేల కోట్ల రూపాయలతో తన జేబును నింపుకొన్నారు. వైఎస్సార్ నెలకొల్పి పుష్కర పథకం ద్వారా పంట పొలాలకు సాగునీరు అందిస్తున్నారు. చంద్రబాబు నెలకొల్పిన పట్టిసీమ, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాల భూసేకరణలో పంట భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందక కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ ఆదేశాలతో 2019లో పట్టిసీమ, పురుషోత్తపట్న ఎత్తిపోతల పథకాలు మూసివేశారు.



మోటార్లు ద్వారా విడుదలవుతున్న నీరు (ఫైల్)

మాకు గర్వకారణం



మా మండలంలో పుష్కర పథకం ఏర్పాటు చేయడం ఎంతో గర్వకారణం. ఇక్కడ నుంచి గోదావరి జలాలను మెట్టప్రాంత భూములకు అందించి.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రైతులకు దేవుడయ్యారు. అదే బాటలో ఆయన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి పయనిస్తూ చక్కని పాలన అందిస్తున్నారు.

– బూలా ఏసు, మాజీ ఎంపీటీసీ, కూనవరం

రైతులకు ప్రాధాన్యం



బీడువారిన భూములకు గోదావరి జలాలను అందించి, వాటిని సస్యశ్యామలంగా మార్చిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కుతుంది. రైతు పక్షపాతిగా, వ్యవసాయం దేశానికి ఎంతో అవసరమని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్సార్. ఆయన బాటలోనే జగన్ పయనిస్తూ రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నారు.

– పేరిచర్ల శ్రీనివాసరాజు, రైతు, వంగలపూడి

సుస్వాగతం



నిడదవోలులో జరిగిన ఎమ్మెల్యే జి.శ్రీనివాస నాయుడు కుమార్తె, అల్లుడు వివాహ రిసెప్షన్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయనకు రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా స్వాగతం పలికారు. – రాజానగరం

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- వైఎస్సార్ సీపీలోకి పలువురి చేరిక



వంగలపూడిలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. జగన్ అమలు చేస్తున్న పథకాలకు పలువురు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. బుధవారం వంగలపూడిలో నియోజకవర్గం బూత్ కమిటీల చైర్మన్, పార్టీలో చేరికల కమిటీ కన్వీనర్ గద్దె వెంకటకృష్ణ చౌదరి (నల్లి) ఆధ్వర్యంలో 60 మంది, ముగ్గళ్లలో కూచిపూడి వెంకట్రావు ఆధ్వర్యంలో 30 మంది వివిధ పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు.

కష్టపడే వారికి గుర్తింపు

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ కష్టపడి పనిచేసే వారికి పార్టీలో ఎప్పుడు గుర్తింపు ఉంటుందన్నారు. సీతానగరం రోడ్డుని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నామని, రాబోవు ఐదు నెలల్లో ఒక ఆకృతికి తీసుకువచ్చేలా కృషి చేస్తానన్నారు. వంగలపూడి నుంచి పెదకొండేపూడి వెళ్లే రోడ్డులో హౌసింగ్ స్థలాల దారిలో తారు రోడ్డు వేసేలా ప్రయత్నిస్తానన్నారు. సింగవరం నుంచి పురుషోత్తపట్నం రోడ్డును రిపేరు చేసి, దానిమీద ఒక లేయర్ బీటి రోడ్డు వేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. తొలుత పెదకొండేపూడిలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, కొంచ భాస్కరరావు, రంధి భారతి దేవి, కవల కృష్ణమూర్తి, కోండ్రపు ముత్యాలు పాల్గొన్నారు.



ముగ్గళ్లలో ఎమ్మెల్యే రాజా సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన వివిధ పార్టీల నాయకులు

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



చినకొండేపూడిలో పశువులకు టీకాలు వేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్లు వెంకటేశ్వర్లు, గీతిక

సీతానగరం: మండల గ్రామాల్లో పశువులకు ఉచితంగా టీకాలు వేస్తామని మండల పశువైద్యాధికారి డాక్టర్ ఆంధ్ర ఫణీంద్ర అన్నారు. చినకొండేపూడిలో 289, వెదుళ్లపల్లిలో 298 పశువులకు బుధవారం టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పశువైద్యశాల, రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని గ్రామాల్లోని ఆవులు, గేదెలు, దూడలకు గాలికుంటువ్యాధి (గాళ్లు) నివారణ టీకాలు వేస్తామన్నారు. బుధ, గురువారాల్లో చినకొండేపూడి-2, వెదుళ్లపల్లి, 3న చినకొండేపూడి-1, కూనవరం, 4, 5, 6న రఘుదేవపురం-1, మిర్తిపాడు, 7, 8న నాగంపల్లి, బొబ్బిల్లంక, 9, 10న రఘుదేవపురం-3, బొబ్బిల్లంక, 11, 12న రఘుదేవపురం-2, బొబ్బిల్లంక, 13, 14న సీతానగరం-2, కాటవరం, 15, 16న సీతానగరం-1, ఉండేశ్వరపురం, 17, 18న సింగవరం, ఉండేశ్వరపురం, 19, 20న వంగలపూడి, ముగ్గళ్ల, 21, 22, 23న పురుషోత్తపట్నం, ముగ్గళ్ల, 24న ఇనుగంటివారిపేట, 27న ములకల్లంక, 30న మునికూడలిలో నేరుగా రైతుల వద్దకు వెళ్లి వారి పశువులకు ఉచితంగా టీకాలు వేస్తామన్నారు. కార్యక్రమంలో సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్లు వై.సుధాకర్, జి.వెంకటేష్, కె.మునేంద్ర, ఎం.గీతిక, ఐ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



బిక్కవోలులో హుండీ ఆదాయం లెక్కిస్తున్న దేవదాయ సిబ్బంది

బిక్కవోలు: స్థానిక శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో హుండీలను లెక్కించగా రూ.17,20,179 ఆదాయం వచ్చినట్లు ఈఓ రామలింగ భాస్కర్ తెలిపారు. గత ఏడాది సెప్టెంబర్ 12 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 28 వరకూ ఈ ఆదాయం సమకూరిందన్నారు. ఈ లెక్కింపులో ఆలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇంటికెళ్లి.. పింఛను ఇచ్చి



పందలపాకలో వృద్ధుడికి పింఛను అందిస్తున్న వలంటీర్

బిక్కవోలు: లబ్ధిదారుల ఇంటికెళ్లి మరీ పింఛన్లు అందిస్తుండడంతో వారి మోములో ఆనందం నెలకొంది. బుధవారం ఒకటో తేదీ కావడంతో మండలంలో జోరుగా పింఛన్ల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమాన్ని తెల్లవారు జాము నుంచే వలంటీర్లు ప్రారంభించారు. మండలంలో 10,520 పింఛన్లు ఉండగా 8,898 మందికి అందజేశారు. తొలిరోజు సాయంత్రానికి మొత్తం 84.58 శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు.



మధురపూడిలో పింఛన్ అందజేస్తున్న దృశ్యం

కోరుకొండ మండలంలో..

మధురపూడి: కోరుకొండ మండలంలో బుధవారం పింఛన్ల పంపిణీ ఉత్సాహంగా జరిగింది. తెల్లవారుజామునుంచే వలంటీర్లు, గృహసారథులు ఈ కార్యక్రమం ప్రారంభించారు. మండలంలోని 24 సచివాలయాల పరిధిలో ఉన్న 12,251 మంది పింఛను లబ్ధిదారులకు గాను 75 శాతం పంపిణీ పూర్తయ్యింది.

వాహనాలకు వేలం

రంగంపేట: రంగంపేటలో వివిధ నేరాల్లో పట్టుబడిన వాహనాలకు బుధవారం వేలం నిర్వహించినట్లు సెబ్ సీఐ వెంకటలక్ష్మి తెలిపారు. పది ద్విచక్ర వాహనాలు, ఒక మూడు చక్రాల వాహనానికి రాజమహేంద్రవరం సూపరింటెండెంట్ ఆఫ్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రాంబాబు ఆధ్వర్యంలో ఈ వేలం నిర్వహించామన్నారు. అనంతరం 141 కేసుల్లో సీజ్ చేసిన 1,989 లీటర్ల సారాను ధ్వంసం చేశామని ఆమె తెలిపారు.

ఉపాధి క్షేత్ర సహాయకుడి సస్పెన్షన్

బిక్కవోలు: రంగాపురంలో ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు సుబ్రహ్మణ్యంను సస్పెండ్ చేసినట్లు ఏపీడీ శ్రీనువాస్ బుధవారం తెలిపారు. ఆ గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించేందుకు వచ్చిన ఆయన్ని విలేకర్లు అడిగిన ప్రశ్నకు పైవిధంగా బదులు ఇచ్చారు. రెండు నెలల కిందట క్షేత్ర సహాయకుడు సుబ్రహ్మణ్యంపై వచ్చిన ఆరోపణపై విచారణ జరిపించామన్నారు. ఈ మేరకు ఆయన్ని సస్పెన్షన్ చేస్తూ, వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసు ఇచ్చామని వివరించారు.

మరుగుదొడ్ల నిర్మాణం

రాజానగరం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్మాణానికి బుధవారం శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలోని కోరుకొండ, దివాన్‌చెరువు, రాజానగరం బస్టాండ్లలో సమస్యలను పరిష్కరించి, అభివృద్ధి చేయాలంటూ రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఇటీవల ఆర్టీసీ చైర్మన్‌ని కలిసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరించి రాజానగరం బస్టాండ్‌లో మహిళల కోసం రెండు, పురుషుల కోసం ఒక మరుగుదొడ్డి నిర్మించనున్నారు. ఈ పనులను సర్పంచ్ కుందేటి ప్రసాద్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు.

ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

రాజానగరం: శ్రీకృష్ణపట్నంలోని అభయాంజనేయ స్వామి ఆలయం 5వ వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. కలశ పూజ, స్వామి కల్యాణం, పల్లకీ సేవలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, నాయకులు కమ్మిడి సోమరాజు, రౌతుల చక్రవర్తి, డి.వెంకటేష్, డి.సూర్యనారాయణ, బత్తిన కరుణాకర్, బోయిడి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


చలివేంద్రం ప్రారంభం



దివాన్‌చెరువులో ఏర్పాటు చేసిన చలివేంద్రం

రాజానగరం: వేసవి ఎండలు ప్రారంభమయ్యాయి. చలివేంద్రాల సీజన్ కూడా మొదలైంది. ఈ నేపథ్యంలో యర్రంశెట్టి కృష్ణమూర్తి అనే యువకుడు దివాన్ చెరువులోని ప్రధాన జంక్షన్ వద్ద బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించాడు. బాటసారులకు తాగునీరు, మజ్జిగ అందజేస్తున్నాడు. మిత్రులు, దాతల సహకారంతో వేసవిలో ఈ చలివేంద్రాన్ని కొనసాగిస్తానని తెలిపాడు. ఉపాధి పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కృష్ణమూర్తి వారాంతంలో దివాన్‌చెరువు, రాజమహేంద్రవరం పరిసరాలలో నిరుపేదలకు భోజనం వితరణ చేస్తున్న విషయం తెలిసిందే.

నిబంధనల మేరకు సర్వే రాళ్ల ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సత్యనారాయణ

పెదపూడి: జగనన్న భూ రక్ష, జగనన్న భూ సమగ్ర రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సర్వే రాళ్ల ఏర్పాటు (పాతటం) కార్యక్రమం నిబంధనల ప్రకారం జరగాలని జెడ్పీ సీఈఓ ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో రాళ్ల ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామాలకు గాను 11 చోట్ల భూ రీసర్వే ప్రక్రియ పూర్తయిందన్నారు. ఆయా గ్రామాల్లో సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయడానికి మండలానికి 13,707 రాళ్లు వచ్చాయన్నారు. ఇందులో ఏ కేటగిరీ రాళ్లు, బీ కేటగిరీ రాళ్లు అనే రెండు రకాలు ఉన్నాయన్నారు. వాటిలో ఏ కేటగిరీ రాళ్లు గ్రామాల సరిహద్దును సూచిస్తాయన్నారు. బీ కేటగిరీ రాళ్లు గ్రామాల్లో ప్రజల భూ స్థలాల సరిహద్దును తెలియజేస్తాయన్నారు. ఇప్పటి వరకు 520 రాళ్ల ఏర్పాటు పూర్తయిందన్నారు. మండలంలో మూడు టీమ్‌లను ఏర్పాటు చేశామని, ఆ టీమ్‌లు రోజుకు 150 రాళ్లు ఏర్పాటు చేసే విధంగా పర్యవేక్షించాలన్నారు. ఎంపీడీఓ పి.విజయభాస్కర్, తహసీల్దార్ టి.సుభాష్, ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టిని తరలిస్తున్న లారీ సీజ్

మధురపూడి: అక్రమంగా మట్టిని తరలిస్తున్న లారీని పోలీసులు సీజ్ చేశారు. బుధవారం రాత్రి కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లో ఎస్సై కట్టా శారదా సతీష్ తనిఖీలు నిర్వహిస్తుండగా మట్టిని తరలిస్తున్న లారీని కనిపించింది. దాన్ని ఆపి రికార్డులు అడిగా, సంబంధిత వ్యక్తులు చూపించలేదు. దీంతో లారీని సీజ్ చేశారు. గురువారం తహసీల్దార్ పాపారావు కోర్టులో హాజరుపర్చనున్నారు.

శ్రీరామా.. రఘురామా



రామవరంలో ఆలయానికి శంకుస్థాపన పూజలు చేస్తున్న చింతా రామకృష్ణారెడ్డి తదితరులు



దొడ్డిగుంటలో విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

వైభవంగా స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ

రంగంపేట: చినదొడ్డిగుంట గ్రామంలో హనుమత్ లక్ష్మణ సహిత సీతా సమేత కోదండ రామచంద్ర మూర్తి విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం జరిగింది. ఉదయం 6 గంటల నుంచి రత్నన్యాసం, యంత్ర ప్రతిష్ఠ, కళాన్యాస హోమాలు, 9 గంటల నుంచి గణపతి, హనుమన్, లక్ష్మణ, సీతా, కోదండ రామచంద్రమూర్తి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, సర్పంచ్ కారి సంజీవరావు, ఎంపీటీసీ లక్ష్మి, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయానికి శంకుస్థాపన

అనపర్తి: రామవరంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. దాతలు, గ్రామస్తుల సహకారంతో రూ.కోట్లతో రామవరం- పొలమూరు రహదారిలో సర్వాంగ సుందరంగా నిర్మించే ఈ ఆలయ పనులకు పారిశ్రామికవేత్త మెహర్ ఆయిల్ ఇండస్ట్రీస్ చైర్మన్ చింతా రామకృష్ణారెడ్డి, వీరలక్ష్మి దంపతులు పూజలు నిర్వహించారు. పెద్దాడకు చెందిన వేద పండితుడు మిక్కిలినేని దుర్గయ్యశాస్త్రి పర్యవేక్షణలో చల్లపిళ్ల త్రిమూర్తులశర్మ ఆధ్వర్యంలో రుత్వికులు పూజా కార్యక్రమాలు జరిపించారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పాల్గొని పూజలు చేశారు. అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి పాపారాయుడు, పారిశ్రామికవేత్త మేడపాటి రామలింగారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కర్రి వెంకటరెడ్డి, కార్యదర్శి మల్లిడి శ్రీనివాసరెడ్డి, ఎం.వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెదపూడి ఎస్సైకు అభినందన



కాకినాడలో ఎస్పీ నుంచి అవార్డు స్వీకరిస్తున్న పెదపూడి ఎస్సై వాసు

పెదపూడి: ఓ ప్రేమోన్మాదికి అతి తక్కువ సమయంలో శిక్షపడే విధంగా కృషి చేసిన పెదపూడి ఎస్సై పి.వాసును కాకినాడ జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్ బాబు బుధవారం సత్కరించారు. ఎస్సై మాట్లాడుతూ గతేడాది అక్టోబర్ 8న కాండ్రేగులలో డిగ్రీ విద్యార్థి దేవికను గుబ్బల వెంకట సూర్యనారాయణ అనే ప్రేమోన్మాది హత్య చేశాడన్నారు. ఈ కేసులో కేవలం ఏడు రోజుల్లో అన్ని ఆధారాలు సేకరించి ఛార్జిషీట్ దాఖలు చేశానన్నారు. నేరం రుజువు కావడంతో సూర్యనారాయణకు జీవిత ఖైదు శిక్ష పడిందన్నారు. కాకినాడ ఎస్పీ కార్యాలయంలో తనకు శాలువాకప్పి, ఉత్తమ ప్రశంసా పత్రం అందించి ఎస్పీ సత్కరించారన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేం



గోకవరంలో మాదిగ అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఎస్‌పీ నాయకులు

గోకవరం: ఎస్సీ వర్గీకరణ సాధనలో ప్రాణత్యాగం చేసిన మాదిగ అమరవీరుల త్యాగాలు మరువలేనివని మహాజన సోషలిస్ట్ పార్టీ మండలాధ్యక్షుడు గరబారపు శ్రీనివాస్ అన్నారు. స్థానిక సంజీవయ్యనగర్‌లోని కమ్యూనిటీ భవనం ఆవరణలో బుధవారం మాదిగ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ సాధనలో అసువులు బాసిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ములపర్తి నాగేశ్వరరావు, పులిగుర్తి రాములు, చాపల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.